క్లుప్తంగా

సింహగిరిపై విశేషంగా శ్రీనృసింహ హోమం



శ్రీనృసింహ హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడషోపచారపూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపజేసి, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అర్చకులు అందించారు.



పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు

నిరాశ్రయుల కేంద్రంలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ మానస

విశాఖ విద్య: బుచ్చిరాజు పాలెంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో ఆదివారం ఉదయం రాబిన్ హుడ్ ఆర్మీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నిరాశ్రయులకు బి.పి, షుగర్ పరీక్షలు చేశారు. మెడికల్ అధికారి ఎస్. మానస వృద్ధుల ఆరోగ్యస్థితుగతులను అడిగి తెలుసుకొని అవసరమైన మందులు సిఫార్సు చేశారు. ఎటువంటి ఆరోగ్య పరమైన సమస్యలు ఎదురైనా వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రాబిన్ హుడ్ ఆర్మీ సభ్యులు నిరాశ్రయులకు తినుబండారాలతో పాటు టవల్స్ అందజేశారు. కార్యక్రమంలో రాబిన్ హుడ్ ఆర్మీ సభ్యులు డాక్టర్ ఉదయ్, డి. సంజీవ కుమార్, ప్రసాద్, రవికాంత్, దివ్య, శంకర్, స్వాతి, ప్రదీప్, మమతా చారిటబుల్ ట్రస్ట్ అధినేత మమత పాల్గొన్నారు.

తెరిపివ్వని వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: ఎడతెరిపి లేకుండా రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజానీకం అంతా అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం పెరగటంతో రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను ఆదివారం శ్రీధర్ పరిశీలించారు. రిజర్వాయర్ నీటిమట్టం వివరాలు అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీటి ఇన్‌ఫ్లో గురించి ఆరా తీశారు. లోతట్టు, కొండవాలు ప్రాంతాల ప్రజలు వీలైనంత వేగంగా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరారు. అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



రాంపురంలో వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ దంపతులు



పెందుర్తిలో 21 అడుగుల గణపతి సన్నిధిలో శరగడం చినఅప్పలనాయుడు, భక్తులు



సుజాతనగర్‌లో గణపతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



బొంకులదిబ్బ వినాయకుడిని దర్శించుకున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, శ్రీనివాసరావు, పెద్దలు



సుజాతనగర్‌లోని అయ్యప్ప దేవాలయంలో పూజలందుకున్న సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వరుడు

శ్రీవినాయకమ్.. ప్రణమామ్యహమ్

- చవితి పూజలకు కొలువుదీరిన గణపయ్య
- ఊరూవాడా విఘ్నాధిపతికి అగ్ర పూజలు



వేంకటాద్రిపై చవితి పూజలందుకున్న గణపతి



వాడచీపురుపల్లిలో గణనాథుడిని దర్శించుకున్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు దంపతులు

తలచితినే గణనాథుని
తలచితినే విఘ్నపతిని దలచిన పనిగా
తలచితినే హేరంబుని
తలచిన నా విఘ్నములను
తొలగుట కొరకున్..

అంటూ తనను మనసారా తలచుకుని ఏ కార్యక్రమం చేపట్టినా అవిఘ్నమస్తు అని ఆశీస్సులందించేందుకు విఘ్నాధిపతి ఊరూవాడా మందిరాలు, చలువ పందిళ్లు, భక్తుల ఇళ్లలో కొలువుదీరాడు. వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గంలోని భక్తులు తమ స్థాయి మేరకు స్వామిని పూజించారు. ఎక్కువగా మృణ్మయ గణపతులనే ఆరాధించి, తరించారు. ఎడతెగని వర్షంలో సైతం మండపాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు.

పెందుర్తి: చవితి పూజలందుకునేందుకు విఘ్నాధిపతి గణనాథుడు కొలువుదీరాడు. భక్తులకు వరాలు కురిపించేందుకు లంబోదరుడు భువికి దిగివచ్చాడు. పలు రూపాల్లో మండపాల్లో పూజలందుకుంటున్నాడు. వినాయక చవితి సందర్భంగా శనివారం నుంచి నియోజకవర్గంలో వాడవాడలా గణపతి పూజలు ఘనంగా మొదలయ్యాయి. పెందుర్తి, పరవాడ, సబ్బవరం మండలాల్లో భక్తజనం ఆధ్యాత్మిక చింతనలో మునిగితేలారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది.

- నియోజకవర్గంలో పలుచోట్ల ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గణపతి మండపాలను సందర్శించి పూజలు నిర్వహించారు.
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లోని పలు మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు జరిపారు.
- జీవీఎంసీ 97వ వార్డులోని చినముషిడివాడ, సుజాతనగర్ ప్రాంతాల్లోని గణపతి మండపాలను సందర్శించిన వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మెంటి మహేష్ ప్రత్యేక పూజలు ఆచరించారు.



చినముషిడివాడలో 18 అడుగుల గణపతి సన్నిధిలో భక్తులు

- జీవీఎంసీ 96వ వార్డులోని వివిధ కాలనీల్లో వెలసిన వినాయకుడి మండపాలను వైఎస్సార్‌సీపీ నేత, మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.
- వేంకటాద్రిపై కొలువుదీరిన గణపతికి చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.
- సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని విఘ్నేశ్వరుడికి పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సింహాచలం: 98వ వార్డు పరిధి అడవివరంలోని ఆయిల్‌మిల్ వద్ద గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 40వ సారి వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆకారంలో గణనాథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గణేష్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు పూజలో పాల్గొన్నారు.

- 93వ వార్డు గణేష్‌కాలనీలో స్థానిక రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతికి అసోసియేషన్ అధ్యక్షుడు దేవరాపల్లి సత్యనారాయణ, సెక్రటరీ పసుపులేటి సూరిబాబుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.
- శిడగంవీధిలో శ్రీనివాస యూత్ ఫ్రెండ్స్ పరశరాముడు ఆకారంలో గణపతిని ఏర్పాటు చేశారు.
- ప్రియాగార్డెన్స్‌లో బంగారమ్మతల్లి యూత్ ఫ్రెండ్స్, సింహగిరిపై గిరిజన కాలనీ ప్రజలు పందిళ్లలో గణనాథులను ఏర్పాటు చేసి పూజించారు.
- 98వ వార్డు సింహపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉయ్యాలలో ఏర్పాటు చేసిన బాలగణపతి భక్తులను ఆకట్టుకుంది.
- 93వ వార్డు ప్రహ్లాదపురంలో గణేష్ యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయోధ్య రామయ్య ఆకృతిలోని గణనాథుడు విశేషంగా ఆకట్టుకున్నాడు.
- సింహాచలం దేవస్థానానికి చెందిన వేద పాఠశాలలోను, పాతటోల్‌గేట్ వద్ద దేవస్థాన గణపతి ఆలయంలో చవితిని విశేషంగా నిర్వహించారు.
- కాపువీధిలో నరసింహ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి దర్శించుకుని పూజలు నిర్వహించారు.
- 93వ వార్డు ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, బాలాజీనగర్, గొల్లనారాయణపురం, విరాట్ నగర్, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో వాడవాడలా గణనాథుల విగ్రహాలు ఏర్పాటుచేశారు.
- 98వ వార్డు గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం జంక్షన్, సింహపురి లేఅవుట్, అప్పన్నపాలెం, షిప్‌యార్డ్ లేఅవుట్, పద్మావతినగర్ తదితర ప్రాంతాల్లో కచవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

పరవాడ: మండలంలో పరవాడ బొంకులదిబ్బ వద్ద ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, గ్రామ పెద్దలు టీవీ అప్పారావు, పైల పోతినాయుడు, పైల హరీష్, పైడంనాయుడు, వర్రి హరి, చుక్క రవికుమార్, చీపురుపల్లి శ్రీనివాసరావు, గండి మహేష్, యూత్ సభ్యులు ఉన్నారు.



సింహగిరిపై గిరిజనులు ఏర్పాటు చేసిన గణనాథుడు



గణేష్‌కాలనీలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

- నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఎంపీటీసి కూండ్రపు అక్కయ్యమ్మ, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, భక్తులు దర్శించుకున్నారు.
- వెన్నలపాలెం జగనన్న కాలనీలో నెలకొల్పిన గణనాథుడికి వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పైల అప్పలనాయుడు, జనసేన నాయకుడు వెన్నల నరసింగరావు, పైల రేగారావు తదితరులు పూజలు జరిపారు.
- రావాడ శివారు బొట్టవానిపాలెంలో నెలకొల్పిన వినాయకుడిని గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పల్లా గోవిందు, బీజేపీ నాయకుడు దాలిబోయిన సంజీవరావు, సారిపల్లి ఆనంద్, బొట్టా రాజు దర్శించుకున్నారు.
- వాడచీపురుపల్లి సంతబయలులో ఏర్పాటు చేసిన గణనాథుని పరవాడ మాజీ ఎంపీపీ మాకవరపు అప్పలనాయుడు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.
- పరవాడ యంగ్‌మెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వినాయక ఆలయంలో ప్రత్యేకంగా నిలిపిన భారీ గణనాథుడి విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు దంపతులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అసోసియేషన్ సభ్యులు పోతల అప్పలనాయుడు, పి.జగదీశ్వరరావు, గండి సత్యనారాయణ, కశిరెడ్డి అప్పలరాజు, డి.శ్రీనివాస్, రెడ్డి నారాయణరావు, రమణాజీ వినాయకుడికి పూజలు జరిపారు.
- పరవాడ నూకాంబిక ఆలయం వద్ద ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో బాలలు ప్రత్యేకంగా ప్రతిష్ఠించిన గణనాథుని వద్ద చిన్నారులు ఆదివారం పూజలు జరిపారు. గణేశునితోపాటు, సరస్వతీదేవిని పూజించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వెన్నలపాలెంలో వినాయకుడిని దర్శించుకున్న గ్రామ పెద్దలు, భక్తులు



వెంకటపతిపాలెంలో గణనాథుడిని దర్శించుకున్న భక్తులు



ప్రియాగార్డెన్స్‌లో బంగారమ్మతల్లి యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటైన గణనాథుడు



సింహపురికాలనీలో ఉయ్యాలలో కొలువుదీరిన బాలగణపతి



ప్రహ్లాదపురంలోని గణేష్ యంగ్ బాయ్స్ అయోధ్య రామయ్య ఆకారంలో గణనాథుడు



పరవాడ నూకాంబిక ఆలయం వద్ద వినాయకుడిని పూజిస్తున్న చిన్నారులు



అడవివరం ఆయిల్‌మిల్ వద్ద సుబ్రహ్మణ్యేశ్వర ఆకృతి గణపతి సన్నిధిలో భక్తులు

ఎడతెగని వాన.. లోతట్టు ప్రాంతాలు జలమయం

- రోడ్లు, పొలాలను ముంచెత్తిన వర్షం
- బొప్పాయి, అరటి తోటలకు తీవ్ర నష్టం
- అప్రమత్తమైన యంత్రాంగం
- పెందుర్తి మండలంలో కంట్రోల్‌రూమ్
- అధికారులు అప్రమత్తం–ఎమ్మెల్యే


పెందుర్తి: ఎడతెరిపి లేని వర్షాల కారణంగా నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. గంట గంటకు వర్షపు నీటి ఉధృతి పెరగడంతో ఆయా ప్రాంతాల్లో ప్రజానీకం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. దీంతో అధికారం యంత్రాంగం అప్రమత్తమైంది

- పెందుర్తి మండలం చింతలగ్రహారం గ్రామానికి వరదనీటి ముప్పు త్రుటిలో తప్పింది. గ్రామానికి సమీపంలో జీవీఎంసీ యూజీడీ మ్యాన్‌హోల్‌ల నుంచి వరద నీరు పొంగడంతో ఒక్కసారిగా గ్రామంలోని ప్రవేశించింది. దీంతో స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయా ప్రాంతంలో పర్యటించిన తహసీల్దార్ వేణుగోపాల్ మ్యాన్‌హోల్‌లకు వెళుతున్న వరదనీటిని జేసీబీల సహాయంతో దారి మళ్లించారు.
- మండలంలోని గుర్రంపాలెంలోకిలో వరదనీరు ప్రవేశించింది. సమీపంలోని కొండవాలు ప్రాంతం నుంచి నీరు రావడంతో గెడ్డలు పొంగి గ్రామంలోకి వరదనీరు చేరింది. ప్రస్తుతం గ్రామంలో, జగనన్న కాలనీలో, ఇతర ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచి ఉండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

యంత్రాంగం అప్రమత్తం: ఎమ్మెల్యే పంచకర్ల


భారీ వర్షాల కారణంగా నీటి ఉధృతి పెరుగుతున్నందున నియోజకవర్గంలోని అన్ని మండలాలు, జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల్లోని యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంత వాసులను హెచ్చరించాలన్నారు. పరిస్థితిని క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

పరవాడ: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, కాలువలు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు 59.5 మి.మీ. వర్షపాతం నమోదయింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్తంభించింది. ఎడతెరిపిలేకుండా పడుతున్న వర్షాలకు పరవాడ, స్వయంభూవరం, వెన్నలపాలెం చెరువులు పూర్తిగా నిండాయి. పరవాడ పెద్ద చెరువు కళింగపై నుంచి నీరు పొంగి ప్రవహిస్తోంది. పరవాడ, తానాం, భరిణికం, రావాడ, స్వయంభూవరం, వాడచీపురుపల్లి ప్రాంతాల్లో పంట పొలాల్లో భారీగా నీరు చేరింది. ఈ వర్షాలకు వీచిన ఈదురు గాలులకు మెట్టపాలెం, తానాం ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న బొప్పాయి, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు రహదారులు మీదుగా వర్షపు నీరు ప్రవహించడంతో అనేక చోట్ల రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు.



సబ్బవరం మండలంలోని నారపాడులో భారీ వర్షాలకు నీట మునిగిన వరి పంట పొలాలు

సబ్బవరం: ఆదివారం రోజంతా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు గ్రామాల్లో సాగు నీటి చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వరి క్షేత్రాలు నీట మునిగి చెరువుల్లా కనిపిస్తున్నాయి. అర్ధరాత్రి నుంచి జోరున కురుస్తున్న వర్షానికి అధిక సంఖ్యలో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ఆదివారం ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5 వరకూ 37 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ వెల్లడించారు. ఇప్పటి వరకూ భారీ వర్షం కురిసినా, ఏ విధమైన గాలుల్లేకపోవడంతో పెద్దగా నష్టం వాటిల్లలేదు. అయితే ఇదే విధంగా వర్షం కొనసాగితే లోతట్టు ప్రాంతాల్లో నీట మునిగిన వరి పొలాలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు అభిప్రాయపడుతున్నారు. వీలైనంత వేగంగా పొలాల నుంచి నీటిని తొలగించే మార్గం చూడాలని రైతులకు సూచిస్తున్నారు.



చింతలగ్రహారంలో మ్యాన్‌హోల్ అవుట్‌లెట్ నుంచి వస్తున్న వరద నీటిని మళ్లిస్తున్న యంత్రాంగం



మెట్టపాలెంలో ఈదురు గాలులకు నేలకొరిగిన బొప్పాయి చెట్లు



పెందుర్తి ఎఫ్‌సీఐ గొడౌన్ వద్ద వరద ఉధృతిపై సమీక్షిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్



శిడగం వీధిలో రోడ్డుకు అడ్డంగా నేలకొరిగిన వృక్షం

అడవివరంలో నేలకొరిగిన వృక్షం

సింహాచలం: కురుస్తున్న భారీ వర్షాలకు అడవివరంలోని శిడగం వీధిలో ఆదివారం తెల్లవారుజామున రోడ్డు పక్కనున్న చెట్టు నెలకొరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో విద్యుత్ ఎల్‌టీ వైర్లు దెబ్బతిన్నాయి. తెల్లవారుజామున కావడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు చెట్టును తొలగించగా, విద్యుత్ సిబ్బంది ఎల్‌టీ లైన్లను పునరుద్ధరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

పరవాడ: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి హెచ్చరించారు. ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాన్ని ఆమె ఆదివారం రాత్రి సందర్శించి, అక్కడి పరిస్థితులను అంచనా వేశారు. ముఖ్యంగా తీర ప్రాంత ప్రజలు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముత్యాలమ్మపాలెంలో ఏర్పాటు చేసిన తుపాను కేంద్రాన్ని పరిశీలించి షెల్టర్‌ను శుభ్రపర్చి వినియోగంలోకి తీసుకురావాలని, అవసరమైన సౌకర్యాలను కల్పించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. మత్స్యకారులను సముద్రంపైకి చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుకు తగు చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆమె ఆదేశించారు. ఆమె వెంట మండల పంచాయతీ విస్తరణాధికారి రమేష్‌నాయుడు, గ్రామ సర్పంచ్ సీహెచ్ సుజాతముత్యాలు ఉన్నారు.



తుఫాన్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి



గుర్రంపాలెం గ్రామాన్ని ముంచెత్తిన వర్షపునీరు

పునరావాస కేంద్రాల గుర్తింపు

వర్షాల ఉధృతికి ఏ సమయంలోనైనా లోతట్టు ప్రాంతాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జోన్–8 పరిధిలో పునరావాస కేంద్రాలను అధికారులు గుర్తించారు.

- 89వ వార్డు చంద్రనగర్ కమ్యూనిటీ హాల్(150 మంది ఉండొచ్చు)
- 90వ వార్డులో లక్ష్మీనగర్ కమ్యూనిటీ హాల్ ఎఫ్ బ్లాక్(70 మంది ఉండొచ్చు)
- 91వ వార్డు బాజీజంక్షన్ రాజీవ్ కల్యాణ మండపం(250 మందికి సరిపోతుంది)
- 92వ వార్డు బాపూజీనగర్ కమ్యూనిటీ హాల్(50 మందికి)
- 93వ వార్డు ప్రహ్లాదపురం కమ్యూనిటీ హాల్(500 మందికి)
- 94వ వార్డు వేపగుంట కమ్యూనిటీ హాల్(350 మందికి)
- 95వ వార్డు వేపగుంట కాపు కల్యాణ మండపం(150 మందికి)
- 97వ వార్డు చినముషిడివాడ ఇందిర ప్రియదర్శిని కల్యాణ మండపం(350 మందికి)
- 98వ వార్డు అడవివరం కమ్యూనిటీ హాల్(100 మందికి)లను సిద్ధంగా ఉంచినట్లు జెడ్సీ హైమావతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



మండలంలో అధ్వానంగా తయారైన రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏ రోడ్డు చూసినా మోకాలి లోతు గుంతలతో నిండి ఉన్నాయి. గుంతల కారణంగా ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుత వర్షాల వలన రోడ్లు మరింతగా పాడయ్యాయి. రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం తక్షణం నిధులు మంజూరు చేయాలి.

– బొడ్డపు చిన్నారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు